సాక్షి గుంటూరు

శుక్రవారం । 16 । జూన్ । 2023



సమస్యల పరిష్కారమే లక్ష్యం

గుంటూరు వెస్ట్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పాల్గొన్నారు.



ఎరువుల దుకాణాలలో తనిఖీలు

నగరంపాలెం(గుంటూరు): పురుగుమందు, ఎరువులు, విత్తన దుకాణాల్లో గురువారం పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు సోదాలు సాగాయి.

అధిక ధరలకు అమ్మితే చర్యలు

నరసరావుపేట ఈస్ట్: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని డీఈఓ కె.శామ్యూల్ గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.



న్యూస్‌రీల్

యథావిధిగా లింగంపల్లి-విశాఖ రైళ్లు

లక్ష్మీపురం(గుంటూరు): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ మీదుగా వెళ్లే పలు రైళ్ల రద్దయిన నేపథ్యంలో లింగంపల్లి-విశాఖపట్నం-లింగంపల్లి రైళ్ల యథావిధిగా నడుస్తాయని డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ గురువారం వెల్లడించారు. లింగంపల్లి-విశాఖపట్నం(12806) రైలు ఈనెల 16 నుంచి విశాఖపట్నం-కడప(17488) రైలు ఈనెల 15 నుంచి కడప-విశాఖపట్నం (17487)రైలు ఈనెల 16 నుంచి యథావిధిగా నడుస్తాయని వివరించారు.

యార్డుకు 48,486 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 48,486 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 46,292 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.24,500 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.13,000 నుంచి 23,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి రూ. 24,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 13,480 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

కేజీబీవీ పాఠశాలల్లో ఖాళీల భర్తీ షెడ్యూల్

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలోని 352 కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తాత్కాలిక మెరిట్ జాబితాను కేజీబీవీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ గురువారం తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 15, 16 తేదీలలో డీఈఓ కార్యాలయంలో తెలియజేయాలని కోరారు. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ఈనెల 19న తుది మెరిట్ జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈనెల 20, 21 తేదీలలో ధ్రువపత్రాల పరిశీలన, 22, 23, 24 తేదీలలో జిల్లా కమిటీ స్కిల్ టెస్ట్ నిర్వహించి 25న కాంట్రాక్ట్ అగ్రిమెంట్, నియామక పత్రాలు అందజేస్తామని వివరించారు.

మహిళా పోలీసుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఉమ్మడి జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని వార్డు మహిళా పోలీసుల బదిలీల కౌన్సెలింగ్ పక్రియ గుంటూరు నగరంలోని పోలీస్ కల్యాణ మండపంలో గురువారం ప్రారంభమైంది. ఈ ప్రక్రియ ఏర్పాట్లను గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ బదిలీల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. వ్యక్తిగత/కుటుంబ సమస్యలు, పిల్లల చదువులు ఇతరత్రా అంశాలకు ప్రాధాన్యం కల్పించాలని చెప్పారు. బదిలీల్లో ఎటువంటి సిఫార్సులకూ అవకాశం ఇవ్వవద్దని సూచించారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం సుమారు 53 మందిని బదిలీ చేశారు. డీఎస్పీలు సుభాష్(ఎస్‌బీ), చంద్రశేఖర్‌రావు (ఏఆర్), రవిచంద్ర (దిశ, పల్నాడు) ఎస్‌బీ సీఐ నరసింహారావు, ఆర్‌ఐలు థామస్‌రెడ్డి, రాజారావు, రాఘవయ్య, ఉమ్మడి జిల్లా పోలీస్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.1,400, గరిష్ఠ ధర రూ.3,100, మోడల్ ధర రూ.2,000 వరకు పలికింది.







ఆణిముత్యాలు మురిసే

జగనన్న ఆణిముత్యాలు మురిశాయి. టెన్త్, ఇంటర్మీడియెట్‌లలో నియోజకవర్గస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సర్కారు గురువారం నగదు అవార్డులు అందించింది. చిలకలూరిపేటలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, వేమూరులో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, సత్తెనపల్లిలో జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రతిభావంతులకు పురస్కారాలు ప్రదానం చేశారు. - సాక్షి, నెట్‌వర్క్

ఫోర్టి ఫైన్

- జూలై నుంచి బలవర్ధక బియ్యం సరఫరా
- పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం
- 5.90 లక్షల రేషన్‌కార్డుదారులకు ప్రయోజనం
- చిన్నారులకు పాఠశాలల్లో రాగిజావ కొనసాగింపు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఒక్క రూపాయికి కిలో బియ్యం పేదవాడి ఆకలిని తీరుస్తుంది. కుటుంబానికి ఆహార భద్రతను అందిస్తుంది. కన్న బిడ్డలు అన్నం లేకుండా ఉండే స్థితిని తల్లిని చూడనీయకుండా చేస్తుంది. మరి పేదవారు తినే ఆహారం ఎలా ఉంటే నాకేం అనుకునే ప్రభుత్వం కాదు జగనన్న సర్కార్. సంకల్పముంటే ఈ ఒక్క రూపాయి బియ్యంతోనే రక్తహీనతను తగ్గించవచ్చు, నాడీ వ్యవస్థను కాపాడవచ్చు, రక్తం వృద్ధికి తోడ్పడవచ్చు. అవును ఇవన్నీ ఒక్క రూపాయి సర్కారు బియ్యంతోనే సాధ్యం. అందుకే ప్రభుత్వం జూలై నుంచి పేదలకు బలవర్ధకమైన ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరాకు చర్యలు చేపట్టింది. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇంతటి మహావిప్లవం రాలేదంటే అతిశయోక్తి కాదు. ఈ మేరకు గుంటూరు జిల్లాలోని 5,90,546 కార్డుదారులకు ఒక్కొక్కరికి 5 కేజీల చొప్పున ఫోర్టిఫైడ్ బియ్యం అందించేందుకు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులు సమాయత్తమయ్యారు. సుమారు 9 వేల టన్నుల బియ్యాన్ని పంపిణీకి సిద్ధం చేస్తున్నారు.



పంపిణీకి సిద్ధం చేస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యం



ఫోర్టిఫైడ్ బియ్యం

ఫోర్టిఫైడ్ బియ్యమంటే..

ఐరన్, ఫోలిక్ ఆమ్లం, విటమిన్ బీ12 అవసరమైన మేర మిక్స్ చేసి పిండిలా తయారు చేస్తారు. ఆ తర్వాత దీనిని బియ్యం గింజల రూపంలోకి మారుస్తారు. దీనిని 1:100 నిష్పత్తిలో అంటే వంద కేజీల మామూలు బియ్యంలో కేజీ ఫోర్టిఫైడ్‌ను కలుపుతారు. మొత్తం మిక్స్ చేసి పేదలకు అందజేస్తారు. దీని వల్ల శరీరానికి కావాల్సిన విటమిన్లు, మినరల్స్ లభిస్తాయి. ఎన్నో అనారోగ్య సమస్యలను అధిగమించే వీలుంటుంది. ఈ బియ్యాన్ని కేవలం అన్నం రూపంలోనే కాకుండా దోశలు, ఇడ్లీలు, పిండి వంటలు, చిన్నారుల చిరుతిళ్లకూ వాడుకోవచ్చు. అయితే థలసీమియా, సికిల్‌సెల్ అనిమియా వ్యాధులు ఉన్నవారు ఈ బియ్యాన్ని వాడకూడదని అధికారులు సూచిస్తున్నారు.

చిన్నారులకు రాగిజావ నిర్విరామంగా..

విద్యార్థుల ఆరోగ్యం మరింత దృఢంగా ఉండాలనే సంకల్పంతో మధ్యాహ్న భోజనంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన రాగాజావ పంపిణీ కార్యక్రమం పాఠశాలల్లో నిర్విరామంగా కొనసాగుతోంది. ఒక్కొక్క విద్యార్థికి 150 ఎంఎల్ చొప్పున జిల్లాలోని 1,081 పాఠశాలల్లోని విద్యార్థులకు జావ సరఫరా చేస్తున్నారు. దీనికోసం జిల్లా పౌరసరఫరాల శాఖ క్రమం తప్పకుండా రాగిపిండి, బెల్లం అందిస్తోంది.



రేషన్‌వాహనం ద్వారా బియ్యం పంపిణీ (ఫైల్)

ఫోర్టిఫైడ్ బియ్యం అమ్మితే చర్యలు



రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పేద ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతోనే ఈ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందిస్తున్నాయి. ఇవి మామూలు బియ్యంలాగానే ఉంటాయి. వండే ముందు కడిగేటప్పుడు కొంచెం తేలినట్లు ఉంటాయి. వాటిని తీసెయ్యకూడదు. ఈ బియ్యం అద్భుతమైన ఫలితాలను ఇస్తుంది. జిల్లాలోని 353 ఎండీయూ వాహనాల ద్వారా యథావిధిగా నెల ప్రారంభం నుంచి 16 రోజులపాటు బియ్యం అందిస్తాం. ఈ బియ్యాన్ని అక్రమంగా అమ్మితే.. అమ్మినవారు, కొన్నవారిపైనా చర్యలు ఉంటాయి. దీనిని అందరూ గమనించాలి. – కోమలి పద్మ, జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి, గుంటూరు


ఆనందాల చి'గురు'

- పారదర్శకంగా బదిలీలు, ఉద్యోగోన్నతులు
- పొరపాట్లకు ఆస్కారం లేకుండా నిర్వహించిన ప్రభుత్వం
- బదిలీస్థానాల్లో కొలువుదీరిన గురువులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 4,366 మందికి స్థాన చలనం
- ఉద్యోగోన్నతులు పొందిన మరో 529 మంది

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో బదిలీలు, ఉద్యోగోన్నతులు ఉపాధ్యాయ వర్గాల్లో జోష్ నింపాయి. ఆనందాల చిగురుతొడిగాయి. బదిలీ, ఉద్యోగోన్నతుల ప్రక్రియను విజయవంతం చేయడంలో జిల్లా విద్యాశాఖ సఫలీకృతమైంది. అర్హులు, సీనియార్టీ జాబితాల తయారీ, ఆన్‌లైన్‌లో అభ్యంతరాల స్వీకరణ మొదలు ప్రత్యేక పోర్టల్ ద్వారా దరఖాస్తుల స్వీరణ, అనంతరం బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తిచేయడం వరకు ఎక్కడా ఎలాంటి పొరపాట్లకూ విద్యాశాఖ తావివ్వలేదు. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా లాంగ్ స్టాండింగ్ విధానంలో హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ కేడర్ల వారీగా మొత్తం 4,366 మంది ఉపాధ్యాయులకు స్థాన చలనం కలిగింది. అలాగే ఉన్నత పాఠశాలల్లో 529 మంది ఎస్జీటీలకు సీనియార్టీ ప్రాతిపదికన స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి దక్కింది. దరఖాస్తుల స్వీకరణ, జాబితాల ప్రదర్శన, ఆప్షన్ల నమోదు ఇలా ప్రతి ఒక్క అంశాన్నీ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో చేపట్టడం ద్వారా ఉపాధ్యాయులు మండుటెండల్లో వ్యక్తిగతంగా డీఈఓ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా చేసిన ప్రభుత్వం వారికి ఇంట్లో నుంచే నేరుగా బదిలీ, ఉద్యోగోన్నతి ప్రయోజనాన్ని కల్పించింది. సరిగ్గా పాఠశాలలు తెరిచే ముందు బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంతో పాఠశాలలు పునః ప్రారంభమైన రోజు నుంచి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పాఠశాలలకు కొత్తగా బదిలీ, ఉద్యోగోన్నతులపై వెళ్లిన ఉపాధ్యాయులు వెళ్లి విధుల్లో చేరారు. దీంతో కొన్నేళ్లుగా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతను అధిగమించేందుకు తాత్కాలిక సర్దుబాటు చేస్తూ వస్తున్న ప్రభుత్వం ఆ సమస్యకు ఇప్పుడు శాశ్వత పరిష్కారం చూపించినట్టయింది.

గురుకుల జూనియర్, డిగ్రీ కళాశాలల్లో సీట్ల భర్తీ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మొదటి విడత సీట్ల కేటాయింపునకు సంబంధించిన ఏపీఆర్‌జేసీ డీసీ సెట్-2023 కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం ముగిసింది. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో నాలుగు రోజులుగా జరిగిన కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినట్లు సంస్థ కార్యదర్శి ఆర్. నరసింహారావు తెలిపారు. నాణ్యమైన విద్యకు చిరునామాగా నిలిచిన గురుకుల విద్యాసంస్థల్లో ప్రతిభ ఆధారంగా సీటు దక్కించుకోవడం విద్యార్థులు అదృష్టంగా భావించాలని, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. 10 జూనియర్ కళాశాలలతోపాటు నాగార్జునసాగర్‌లోని డిగ్రీ కళాశాలలో మొదటి విడతలో సీట్లు పొందిన విద్యార్థులకు అలాట్‌మెంట్ ఆర్డర్లు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఆర్‌జేసీ డీసీ సెట్ రాష్ట్ర కన్వీనర్ హెచ్‌ఎండీ ఉబేదుల్లా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థికి అలాట్‌మెంట్ ఆర్డర్ అందజేస్తున్న నరసింహారావు

కారుచోల గ్రామ సచివాలయంలో తొలి రిజిస్ట్రేషన్

యడ్లపాడు: కారుచోల గ్రామ సచివాలయంలో తొలి రిజిస్ట్రేషన్ గురువారం జరిగింది. వైఎస్సార్ జగనన్న భూహక్కు - భూరక్ష కార్యక్రమంలో భాగంగా రీసర్వే ప్రక్రియను ముగించుకుని భూహక్కు పత్రాలు వచ్చిన గ్రామాల్లో స్థానికంగానే రైతులు తమ వ్యవసాయ భూముల్ని రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చిలకలూరిపేట సబ్‌రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు, యడ్లపాడు తహసీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరరావు కారుచోల గ్రామ సచివాలయాన్ని గురువారం సందర్శించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియపై పంచాయతీ కార్యదర్శికి వివరించారు. డాక్యుమెంట్ల రూపకల్పన, ఆన్‌లైన్‌లో నమోదు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కారుచోల గ్రామానికి చెందిన సయ్యద్ మాలింబి యడ్లపాడు నివాసి షేక్ బాజీకి స్థలం విక్రయించడంతో సదరు స్థలం విలువను గజం రూ.2వేల చొప్పున లెక్కకట్టి సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ చేసి, డాక్యుమెంట్‌ను కార్యదర్శి అందించారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వాసు, పంచాయతీ కార్యదర్శి పి.అంకయ్య, ఆర్‌ఐ చక్రవర్తి పాల్గొన్నారు.



కారుచోల సచివాలయంలో తొలిగా చేసిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ అందిస్తున్న అధికారులు

ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా పనిచేద్దాం

సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

లక్ష్మీపురం(గుంటూరు): ప్రయాణికుల భద్రతపై రైల్వే సూపర్‌వైజర్లు, సిబ్బంది దృష్టిపెట్టాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ సూచించారు. గుంటూరు పట్టాభిపురంలోని రైల్వేడివిజన్ కార్యాలయంలో గురువారం సిబ్బంది, సూపర్‌వైజర్లకు అవగాహన సదస్సు డీఆర్‌ఎం రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ పరికరాల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ అవసరం అన్నారు. వర్షాకాలంలో మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కమ్యూనికేషన్ వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.



సదస్సులో మాట్లాడుతున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, వేదికపై డీఆర్‌ఎం రామకృష్ణ

అనంతరం రైల్వే జీఎం లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్‌లతో సహా భద్రతా సిబ్బందికి అందిస్తున్న శిక్షణపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కె.సైమన్, ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు గుంటూరు జిల్లాస్థాయి జగనన్న ఆణిముత్యాలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల నుంచి జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఈనెల 17న జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా సత్కరించి, నగదు ప్రోత్సాహకాలను అందజేయనున్నట్లు డీఈఓ పి.శైలజ గురువారం తెలిపారు. కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన కేవీపీ కాలనీలోని కేఎస్‌ఆర్టీ నగర పాలకసంస్థ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులను సత్కరించి, వారికి ప్రభుత్వం ప్రకటించిన నగదు ప్రోత్సాహకాలను బహూకరించనున్నట్లు వివరించారు.

కించెత్తయినా లేకుండా ప్రక్షాళన

- మున్సిపాలిటీ డంపింగ్ యార్డుల్లో వ్యర్థాల తొలగింపునకు చర్యలు
- సత్తెనపల్లిలో రెండు యార్డుల స్వచ్ఛీకరణకు శ్రీకారం
- రూ.2.75 కోట్లతో సత్తెనపల్లిలో లెగసీ వేస్టేజ్ ప్రాజెక్ట్ పనులు
- పూర్తయిన టెండర్లు,
- వేగంగా జరుగుతున్న పనులు

సత్తెనపల్లి: జిల్లాలోని పురపాలక సంఘాల పరిధిలో సేకరించిన చెత్తాచెదారమంతా ఏళ్ల తరబడి డంపింగ్ యార్డుల్లో కొండలా పేరుకుపోయింది. ఫలితంగా ఆ సమీపంలోని వాసులు దుర్గంధం భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ ఆరోగ్యం పాడవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పురపాలక సంఘాల అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించారు. అయితే గత పాలకులు వీరి మొర ఆలకించలేదు. అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పురపాలక సంఘాల్లోని డంపింగ్ యార్డుల్లో ఐదేళ్ల నుంచి నిల్వ చేసిన చెత్తను తొలగించేందుకు ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా సర్వే చేపట్టింది. లెగసీ వేస్టేజ్ ప్రాజెక్ట్ ద్వారా కొన్ని మున్సిపాలిటీలను ఎంపిక చేసి వ్యర్థాల తొలగింపునకు నిధులూ కేటాయించింది. ఇటీవల టెండర్లనూ పిలిచింది. చెత్త తొలగింపునకు అయ్యే వ్యయంలో కేంద్ర ప్రభుత్వం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 33 శాతం భరిస్తుండగా, పురపాలక సంఘాలు 15వ ఆర్థిక సంఘం నిధులు 17 శాతం వెచ్చిస్తున్నాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు యంత్రాల ద్వారా చెత్త తొలగింపును ప్రారంభించారు.

25 వేల మెట్రిక్ టన్నుల చెత్తను ఎరువుగా మారుస్తారు

సత్తెనపల్లిలో పెరుగుతున్న జనాభాతోపాటు చెత్త ఉత్పత్తి పెరుగుతోంది. పట్టణంలో నరసరావుపేటరోడ్‌లో ఒకటి, మాచర్ల రోడ్డులో మరొకటి మొత్తం రెండు డంపింగ్ యార్డులు ఉన్నాయి. 35 ఏళ్లుగా పట్టణంలో సేకరించిన చెత్తను వీటిల్లోనే పోస్తున్నారు. ఫలితంగా నాలుగు ఎకరాల విస్తీర్ణంలో సుమారు 25 వేల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకున్నట్టు అంచనా. ఈ డంపింగ్ యార్డుల వల్ల 22వ వార్డు, 26, 27, 28, 29 వార్డుల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వీరి ఇబ్బందులు తొలగిపోనున్నాయి. సత్తెనపల్లిలోని రెండు డంపింగ్ యార్డుల ప్రక్షాళన పనులను చిలకలూరిపేటకు చెందిన కృతి ఇంజినీరింగ్ సంస్థ దక్కించుకుని పనులు ప్రారంభించింది. పేరుకుపోయిన చెత్తను యంత్ర పరికరాలతో చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి బయోమైనింగ్ చేయడం ద్వారా అధునాతన పద్ధతుల్లో చెత్తను ఎరువుగా మార్చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు.



చెత్తను బయోమైనింగ్ చేస్తున్న యంత్రాలు

నిధులు ఇలా..

సత్తెనపల్లిలోని రెండు యార్డుల ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం 33 శాతం అంటే రూ.90.75 లక్షలు, కేంద్ర ప్రభుత్వం 50 శాతం అంటే రూ.1.37 కోట్లు భరిస్తున్నాయి. పురపాలక సంఘం 17 శాతం అంటే రూ.47 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చుచేయనుంది.

పర్యావరణ హితం

లెగసీ అంటే పాత చెత్తను తీసేయడం. పర్యావరణ హితం కోసం నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ఆదేశాల మేరకు సత్తెనపల్లిలో రెండు డంపింగ్‌యార్డుల్లో పేరుకుపోయిన 25 వేల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించనున్నాం. ఈ చెత్త నుంచి నిప్పు లేకుండానే పొగ వస్తుంటుంది. దీనివల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని శాస్త్రీయంగా తొలగించేందుకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చొరవ చూపారు. నరసరావుపేట రోడ్‌లోని డంపింగ్ యార్డులో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం సేకరిస్తున్న చెత్తను పవర్‌ప్లాంట్లకు తరలిస్తున్నారు. భవిష్యత్‌లో పార్కులు వంటి వాటికి డంపింగ్‌యార్డు స్థలాలను కేటాయిస్తాం.

– కొలిమి షమ్మి, మున్సిపల్ కమిషనర్, సత్తెనపల్లి

క్లుప్తంగా

వృద్ధుల భద్రతకు భరోసా

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



వృద్ధుల భద్రత కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల: వేధింపుల నుంచి రక్షణ కల్పించి, గౌరవప్రదంగా బ్రతికేలా వృద్ధులకు భద్రత కల్పిస్తామని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. వృద్ధుల పోషణకు, ఆస్తిపాస్తుల రక్షణకు భరోసా కల్పిస్తామని ఆయన అన్నారు. గురువారం ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం సందర్భంగా కరపత్రాలను ఎస్పీ వకుల్‌జిందాల్ విడుదల చేశారు. సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జీవీ బ్రహ్మం, కార్యదర్శి కె.శ్రీహరిరావు, కోశాధికారి సీహెచ్ శ్రీరామ శర్మ ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, అసోసియేషన్ సభ్యులు బి. వెంకటేశ్వర్లు, పి. వెంకటేశ్వర్లు ఎం.తాతయ్య, ఎం.మాల్యాద్రి రావు, పి.విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కౌంటర్ల ద్వారా ఉచిత బస్‌పాస్‌లు

నరసరావుపేట: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని కౌంటర్ల ద్వారా విద్యార్థులు ఉచిత, రాయితీ బస్‌పాస్‌లు పొందవచ్చని డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి గురువారం వెల్లడించారు. గతంలో తమ సిబ్బంది విద్యాలయాలకు వెళ్లి అందజేసే వాళ్లన్నారు. ఆ విధానాన్ని మార్చి బస్టాండ్‌లోని కౌంటర్ల ద్వారానే పాస్‌లు అందజేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఇతర వివరాలకు 99592 25428, 73828 96041 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర సంక్షేమం కోసం హాజీలు దువా చేయాలి



హజ్ యాత్రకు బయలు దేరిన హాజీల బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న డెప్యూటీ సీఎం అంజాద్ బాషా, ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తాఫా

డెప్యూటీ సీఎం అంజాద్ బాషా

పెదకాకాని: పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే హాజీలు రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలు, భోగభాగ్యాలు, సిరిసంపదలతో విరజిల్లాలని దువా (ప్రార్ధనలు) చేయాలని డెప్యూటీ సీఎం అంజాద్ బాషా తెలిపారు. పెదకాకాని మండలంలోని నంబూరు సిరాజుల్ ఉలూం మదరసాలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ హజ్‌హౌస్‌ను రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ బద్వేల్ షేక్ గౌసల్ అజాం, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తాఫాతో కలసి సందర్శించారు. గురువారం ఉదయం ప్రత్యేక బస్సుల్లో హజ్‌యాత్రకు బయలు దేరిన హాజీలకు జెండా ఊపి యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా డెప్యూటీ సీఎం మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు బయలుదేరుతున్న హాజీలకు ప్రత్యేక సౌకర్యాల్ని కల్పించినట్లు చెప్పారు. టికెట్ ధర వ్యత్యాసాన్ని సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పెద్దమనసుతో, ముస్లింలపై ఉన్న అనంతమైన ప్రేమతో భర్తీ చేశారని తెలిపారు. బస కేంద్రంలో హాజీల వసతుల్ని ప్రతిక్షణం పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగంలో అన్ని శాఖల్ని సమన్వయం చేసుకుని హజ్ కమిటీ సీఈవో అబ్దుల్ ఖాదిర్ బస శిబిరంలో సిబ్బందితో 24 గంటలు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. గుంటూరు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా ఏర్పాటు చేసిన నీటి కూలర్లు అద్భుతమని ప్రశంసించారు. ఇప్పటికే హజ్ యాత్రకు వెళ్లిన వారు ఆధ్యాత్మిక గమ్యస్థానాలకు చేరుకున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో కూడా హజ్ యాత్రికులకు నిస్వార్థ సేవలందిస్తామని పేర్కొన్నారు. ముందుగా యాత్రకు బయలుదేరిన హాజీలకు చేతి గొడుగు, మిఠాయిల్ని అందజేశారు. కార్యక్రమంలో ముఫ్తి సయ్యద్ షా, మొహమ్మద్ అలీ బాగ్దాది, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, ముహమ్మద్ రూహుల్లా, హజ్ కమిటీ సభ్యులు వలియుల్లా హుస్సేనీ, హఫీజ్ మన్సూరు అహమ్మద్, ఇబాదుల్లా, బాసిత్, పుంగనూరు ఖాదర్ పాల్గొన్నారు.


తెలుగు సాహిత్యంలో ప్రయోగానికి ఆద్యుడు నగ్నముని

- సాహిత్య వాక్యానికి రాజకీయ వాసనలు అద్దిన కవి
- తెలుగు నేలన దిగంబర కవితోద్యమానికి సారథి
- 'ఎమర్జెన్సీ'తో పెల్లుబికిన విలోమ కథలు
- రేపు తెనాలిలో నగ్నముని విలోమ కథలు ఆవిష్కరణ సందర్భంగా..

తెనాలి: ప్రముఖ రచయిత, కవి నగ్నముని రచించిన విలోమకథలు మూడో ప్రచురణ వెలువడింది. రచయిత స్వస్థలమైన తెనాలిలో ఈనెల 17న సాయంత్రం ఆవిష్కరించి, నగ్నమునిని సత్కరించనున్నారు. ఈ సందర్భంగా ఆయన సాహితీ విశేషాల రేఖామాత్ర పరిచయమిది.

తెనాలిలో 1940లో జన్మించిన నగ్నముని తన 17వ ఏటనే 'సుధ' పేరుతో 'తెలుగు స్వతంత్ర'లో 'సౌందర్యపు స్వగతం' కవిత రాశారు. అప్పటి నుంచి దేశానికి చీకటి రోజులను ప్రసాదించిన అత్యయిక స్థితి (ఎమర్జెన్సీ) నుంచి పెల్లుబికిన విలోమ కథలు వరకు తెలుగు సాహిత్యంలో ప్రయోగాత్మక ఒరవడికి ఆద్యుడిగా నిలిచారు. తొలి ఆధునిక మహాకావ్యంగా, రాజకీయ తాత్విక కావ్యంగా తన 'కొయ్య గుర్రం' లేవనెత్తిన చర్చ ఒక చరిత్ర. వర్తమాన వికృతరూపాన్ని 'ఆకాశదేవర'తో హెచ్చరించారు. సాహిత్యాన్ని ఉద్యమస్థాయికి తీసుకెళ్లిన దిగంబర కవిత్వానికి 'కర్త, కర్మ, క్రియ నేనే'నంటూ సగర్వంగా ప్రకటించుకొన్న అగ్నిఖని 'నగ్నముని'.

ఎనిమిది దశాబ్దాల క్రితం తెనాలిలో కళ్లు తెరిచిన మానేపల్లి హృషీకేశవరావు, నగ్నమునిగా మారడం అంత తేలిగ్గా జరగలేదు. కృష్ణాపత్రిక లాంటి పత్రికల్లో కవిత్వం రాసిన ఆయన తండ్రి మానేపల్లి సంగమేశ్వర కవి పద్య వారసత్వాన్ని కొనసాగించాడు నగ్నముని. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష రాసి, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఉద్యోగంలో చేరే నాటికి ఆయన వయసు పద్దెనిమిదేళ్లు. అప్పట్నుంచి నాలుగు దశాబ్దాలపాటు రాజకీయ నేతల అసలు రూపాన్ని దగ్గరగా చూశారు. సాహిత్యంతో సమాజానికి శస్త్రచికిత్స చేయాలని తలపోశాడు. ఆయన కవిత్వం మొదలుపెట్టే నాటికి కాలం అనేక సంక్షోభాలను చవిచూసింది. అయిదు దశాబ్దాల నగ్నముని సాహిత్య జీవితం, తెలుగునేలపై జరిగిన అన్ని కల్లోలాలను ఒక క్రమపద్ధతిలో నమోదు చేసింది.



విలోమ కథలు 3వ ముద్రణ

తెలుగు సాహిత్య వాక్యానికి రాజకీయ వాసనలు అద్దాడు. రాజ్యహింసను, నిర్బంధాలనూ అనుభవించాడు. తాను చూసిన సంక్షోభాలు, విచ్ఛిన్నమవుతున్న మానవ విలువలు, సాహిజిక సందర్భాలు ఎదు ర్కొనే క్రమంలో జరిగిన మాన ప్రాణ నష్టాలను దగ్గరగా చూశారు. 'ఎమర్జెన్సీ మన అస్తిత్వ చరిత్రకే అవమానకరం'అని ఎలుగెత్తినవాడు నగ్నముని. 'విలోమ కథలు'తో మొదలైన ఆ పరంపర 'ఆకాశదేవర' వరకు కొనసాగింది.

ఆనాడు-ఎమర్జెన్సీని ఏ రచయితా నిరసించలేదు. పైగా శ్రీశ్రీ, ఆరుద్ర వంటివారు సమర్థన చేశారంటారు. ఎమర్జెన్సీలో నగ్నముని రాసిన 'విలోమ కథలు' ప్రకంపనలు కలిగించాయి.. సంప్రదాయ రూపాన్నీ, వస్తువునీ ధ్వంసం చేశాయి. 'రాజకీయ విలువలు తల్లకిందులైనచోట ప్రజలు మనుషులుగా బతకడం కష్టం' అంటారు నగ్నముని. దిగంబర కవిత్వంతో నిద్రపోతున్న సాహిత్యలోకాన్ని ఒక చరుపు చరిచి లేపినవాడు కనుక-అయితే ఆకలి కథలు, లేకపోతే ప్రేమకథలు అనే పద్ధతిలో సాగుతున్న తెలుగు కథారచనను కొత్త మార్గాలకు పట్టించారాయన. రాజకీయాలు, జీవిత విశ్వాసాలు, విలువలు తలకిందులుగా నడుస్తున్నా యని కుండబద్దలు కొట్టినట్టు చెప్పడానికి నగ్నముని ఎంచుకున్న విలోమ శైలి సాహిత్యంలో మరో ప్రయోగం. ఈ కథలతో ఉద్యోగం నుంచి డిస్మిస్ అయ్యారు కూడా! ఎమర్జెన్సీ తర్వాత కేంద్రంలో కొత్త ప్రభుత్వం వచ్చాక తిరిగి ఉద్యోగంలోకి తీసుకున్నారు. అయినా తన సాహిత్య సృజనను వదులుకోలేదు. పత్రికల్లో కాలమ్ వ్యాసాలు రాశారు. మరోచరిత్ర, ఎంఎల్‌ఏ ఏడుకొండలు, త్రిశూలం, ఉదయం సినిమాలకు మూలకథలు సమకూర్చారు. అంతకుముందే ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపిల్ల' నవలను నాటకీకరించారు. ఈ నాటకాన్ని ఏఆర్ కృష్ణ వివిధ చోట్ల వందకు పైగా ప్రదర్శనలిచ్చారు.

2011లో రచించిన 'ఆకాశదేవర'ను పాటిబండ్ల ఆనందరావు నాటకీకరించారు. తెనాలిలో అజోవిభ కందాళం ఫౌండేషన్ నగ్నమునిని సత్కరించి 'సాహితీ వైజయంతి' శీర్షికతో సన్మాన విశేషసంచికను విడుదల చేశారు.

వార్డు సచివాలయ కార్యదర్శుల బదిలీలు

పాత గుంటూరు: ప్రభుత్వ నిబంధనల మేరకు వార్డ్ సచివాలయ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ చేపట్టామని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వార్డ్ కార్యదర్శులకు బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వార్డ్ సచివాలయ కార్యదర్శులకు బదిలీలకు ఆమోదం తెలిపిందని, మున్సిపల్ పరిధిలోని వార్డ్ అడ్మిన్, వెల్ఫేర్, డేటా ప్రాసెసింగ్ అండ్ ఎడ్యుకేషన్, శానిటేషన్, ప్లానింగ్, ఎమినిటి కార్యదర్శులకు గురువారం బదిలీల కౌన్సెలింగ్ చేపట్టామన్నారు. వికలాంగులు, మానసిక అనారోగ్యం కలిగిన తల్లిదండ్రులు ఉన్నవారు, అనారోగ్య సమస్యలు, ఒంటరి, వితంతువులు, స్పౌస్, మ్యూచువల్ అంశాలు ప్రాధ్యాన్యతగా బదిలీలు జరిగాయన్నారు. నగరపాలక సంస్థ సహకారంతో తగిన సిబ్బంది ద్వారా చెక్ లిస్టు ప్రకారం బదిలీకి అందిన వారి దరఖాస్తులను పరిశీలించి, ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లతో కౌన్సిలింగ్ చేశామన్నారు. బదిలీలకు వార్డ్ అడ్మిన్‌లు 11, శానిటేషన్ 6, వెల్ఫేర్ 17, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ 10, ప్లానింగ్ 6, ఎమినిటిస్ 13 మంది కార్యదర్శులు హాజరయ్యారు. గురువారం సాయంత్రమే బదిలీ ఆర్డర్ అందించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సి.హెచ్. శ్రీనివాసరావు, టి. వెంకట కృష్ణయ్య, మేనేజర్ శివన్నారాయణ, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్.డీ శ్రీనివాసరావు

ప్రభుత్వ పాఠ్య పుస్తకాలతోనే బోధన చేయాలి

పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ముద్రించిన పాఠ్య పుస్తకాలతోనే బోధన చేయాలని పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్య పుస్తకాలను కొనుగోలు చేయకుండా అనధికార పుస్తకాలతో బోధన సాగించే పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. నగరంపాలెంలోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గురువారం గుంటూరు డివిజన్ పరిధిలోని ప్రైవేటు ఉన్నత పాఠశాలల యాజమాన్యాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్జేడీ సుబ్బారావు మాట్లాడుతూ ఎస్సీఈఆర్టీ రూపొందించిన ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులందరి వద్ద ఖచ్చితంగా ఉండాలని చెప్పారు. హెచ్‌ఎం లాగిన్ ద్వారా ప్రతి ఒక్క ప్రైవేటు పాఠశాల పాఠ్య పుస్తకాల కోసం ఇండెంట్ పెట్టి, దాని ప్రకారం ప్రభుత్వ గుర్తింపు పొందిన విక్రయదారుల నుంచి పుస్తకాలను కొనుగోలు చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న ఆర్జేడీ సుబ్బారావు

గుంటూరు జిల్లా వ్యాప్తంగా 600 ప్రైవేటు పాఠశాలలు ఉండగా, వాటిలో ఇప్పటి వరకు 56 పాఠశాలలే ఆన్‌లైన్‌లో పుస్తకాల కోసం ఇండెంట్ పెట్టారని, వాస్తవ సంఖ్యలో ఉన్న విద్యార్థులకు కాకుండా నామమాత్రంగా ఆర్డర్ పెట్టినట్లు చెప్పారు. ప్రైవేటు పాఠశాలలు తమ దగ్గర నమోదైన విద్యార్థులందరికీ ఖచ్చితంగా ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను కొనుగోలు చేయాల్సిందేనని, ఇందులో ఏ ఒక్కరికీ మినహాయింపు లేదని స్పష్టం చేశారు. సీఎస్ఈ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా ఇండెంట్ పెట్టడం ద్వారా ప్రభుత్వ గుర్తింపు కలిగిన విక్రేతల నుంచి పాఠ్య పుస్తకాలను కొనుగోలు చేయాలని, ఆ విధంగా కాకుండా ప్రైవేటు విక్రేతల నుంచి పుస్తకాలను కొనుగోలు చేస్తే కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

పాఠశాలలు తెరిచే నాటికే అన్ని అనుమతులు పొందాలి

పాఠశాలలు తెరిచేనాటికి ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులను విధిగా పొందాలని ఆర్జేడీ సుబ్బారావు స్పష్టం చేశారు. మరుసటి ఏడాది జూన్‌లో పాఠశాలలు తెరవాలంటే, అక్టోబర్‌లోనే రెన్యువల్, గుర్తింపు కోరుతూ దరఖాస్తు దాఖలు చేసుకోవాలని మే 31లోపు అన్ని అనుమతులు పొందిన తరువాతే పాఠశాలలను తెరవాలని చెప్పారు.

గైర్హాజరైన వారిపై ఆగ్రహం

సమావేశానికి గైర్హాజరైన పలువురు పాఠశాలల డైరెక్టర్లు, కరస్పాండెంట్లపై ఆర్జేడీ సుబ్బారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో గుంటూరు డీవైఈవో వెంకటేశ్వరరావు, ఎంఈవో బలిరాం, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, వివిధ మండలాల ఎంఈవోలు పాల్గొన్నారు.

యోగా వారోత్సవాలు ఆరంభం



యోగాసనాలు వేస్తున్న బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ, ఉద్యోగులు

- సర్వరోగ నివారిణికి యోగా ఉపయోగకరం
- బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు(గుంటూరు): భారతదేశం ప్రపంచానికి అందించిన మహోన్నత సంపద యోగ విద్య అని, మనస్సు లగ్నం చేసి అభ్యాసం చేస్తే సర్వ రోగ నివారిణిగా యోగ ఉపయోగపడుతుందని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా పట్టాభిపురంలోని బజరంగ్ ఫౌండేషన్ కార్యాలయంలో యోగా వారోత్సవాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ వేగం ఎక్కువైన వర్తమాన సమాజంలో ఒత్తిడి సర్వ సాధారణమైందని, దీనికి యోగా చక్కటి పరిష్కారం చూపుతోందని స్పష్టం చేశారు. ఆరోగ్యవంతమైన జీవితం కూడా జీవన ప్రమాణస్థాయి పెంపుదలలో భాగమేనన్నారు. యోగా పట్ల ఆసక్తిని, అవగాహనను పెంపొందించి, అధిక సంఖ్యలో ప్రజలు యోగా పట్ల ఆకర్షితులై తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వేల సంవత్సరాల భారతీయ మూలాల నుంచి యోగా విద్య మనకు వరప్రదాయనిగా ఉందని, దీనిని నేటి తరం అంది పుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

సమాజంలో యోగా పట్ల ఆసక్తిని, అవగాహనను పెంపొందిస్తూ యోగా అభ్యాసంలో మెలకువలను నేర్పుతూ 'యోగా వారోత్సవాలను' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లను ప్రోత్సహించేందుకు అమృతాహారాన్ని పంపిణీ చేశారు. జీవన శైలి వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆచార్య పతంజలి గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

బాల్య వివాహం చట్టరీత్యా నేరం

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

తిక్కిరెడ్డిపాలెం (ప్రత్తిపాడు): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ప్రత్తిపాడు సీఐ ఎం.వి. సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెంలో ఇటీవలే పదో తరగతి పూర్తి చేసుకున్న పదిహేను సంవత్సరాల బాలికకు వివాహం చేసేందుకు తల్లిదండ్రులు ప్రయత్నిస్తున్నారంటూ ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందింది. దీంతో ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వి. సుజాతాదేవి, సీఐ ఎం.వి సుబ్బారావు, ఎంపీడీవో శ్రీరమ్య, ఎస్ఐ రవీంద్రబాబు, ఏపీఎం సురేష్‌కుమార్ గురువారం మధ్యాహ్నం గ్రామంలోని బాలిక నివాసానికి వెళ్లారు. తల్లి ఎం. సౌజన్యతో మాట్లాడారు. బాలిక వివరాలు, వయస్సును అడిగి తెలుసుకున్నారు. ఆధార్‌లోని పుట్టిన తేదీ ప్రకారం మైనరేనని అధికారులు నిర్ధారించుకున్నారు. బాల్య వివాహం చేసినా, చేసుకున్నా, ప్రోత్సహించినా చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని చెప్పారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ మేజరయ్యేంత వరకూ వివాహం చెయ్యడానికి వీల్లేదని తల్లికి సూచించారు. మరో మూడేళ్ల పాటు కచ్చితంగా చదివించాల్సిందేనని, మంచి కళాశాలలో చేర్పిస్తామని చెప్పారు. మైనార్టీ తీరే వరకు వివాహం చెయ్యబోమని కుటుంబ సభ్యుల నుంచి లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. సీఐ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు ఎదురవుతాయని వివరించారు.



బాలిక తల్లితో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు, ఎంపీడీవో శ్రీరమ్య, సీడీపీవో

రూపాయికే టిడ్కో గృహాలిచ్చిన ఘనత జగనన్నదే

- అర్హతే ప్రామాణికంగా పేదవాడికి సంక్షేమం, అభివృద్ధి చేరువ చేసిన జగనన్న
- టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

తాడికొండ: పేదలకు వరంగా టిడ్కో గృహాలను ఒక్క రూపాయికే అందించిన ఘనత సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డిదే అని ఉమ్మడి గుంటూరు జిల్లాల ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. తుళ్లూరులో టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి పేదవాడికి అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదే అని ఇచ్చిన మాటకు కట్టుబడి నూరుశాతం హామీలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి భారతదేశంలో ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క జగనన్న మాత్రమే అన్నారు.

వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ బాబు చేసిన నిర్వాహకం కారణంగానే నేడు టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమం ఆలస్యమైందన్నారు. ఈ సందర్భంగా తుళ్లూరు మండలంలోని తుళ్లూరుతో పాటు దొండపాడు, శాఖమూరు, ఐనవోలు, వెంకటపాలెం, బోరుపాలెం, అబ్బరాజుపాలెం, లింగాయపాలెం, మల్కాపురం, నెక్కల్లు, నేలపాడు, ఉద్దండరాయుని పాలెం, వెలగపూడి గ్రామాల పరిధిలోని సుమారు 920 మంది లబ్ధిదారులకు గృహ రిజిస్ట్రేషన్ పత్రాలను వారు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివన్నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కొప్పుల శేషగిరిరావు, కొమ్మినేని దత్తు, సీఆర్‌డీఏ అధికారి బొర్రా శ్రీనివాసరావు, పలువురు అధికారులు, టిడ్కో ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా

ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారుల ప్రతిభ

గుంటూరు వెస్ట్ (క్రీడలు): విజయవాడలో ఈ నెల 12, 13 తేదీల్లో జరిగిన వైఎస్సార్ ట్రోఫీ- సౌత్ ఇండియా హార్డ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో స్థానిక ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారులు అద్భుత ప్రతిభకనబరిచారని కోచ్ జీవీఎస్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పి.సూర్య ఆకాష్ 20 + కేటగిరిలో డబుల్స్, సింగిల్స్‌లో బంగారు పతకాలు, దిషాంత్ అండర్-14 విభాగంలో రజత పతకం సాధించారన్నారు. వీరిద్దరినీ స్టేడియంలో రేమండ్స్ అధినేత అరుణ్ కుమార్, ప్రసాద్‌లు సత్కరించారని చెప్పారు.



అరుణ్ కుమార్‌తో క్రీడాకారులు

18న జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

ఈ నెల 18 మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు జిల్లాస్థాయి బాస్కెట్ బాల్ పోటీలను స్థానిక పోలీస్ పేరేడ్ మైదానంలో నిర్వహిస్తామని న్యూ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రేవతి, జి.ఆంజనేయులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2005 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపికైన జట్టును ఈ నెల 29 నుంచి నూజివీడులో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు.

ఫీజులు తగ్గించి మేలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 85 శాతం స్థానికులకు కేటాయించాలి
- మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

గుంటూరు మెడికల్: ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో గతంలో అధికంగా ఉన్న యూజీ, పీజీ బీ కేటగిరి సీట్ల ఫీజుల్ని రాష్ట్ర ప్రభుత్వం చాలా తగ్గించి వైద్య విద్యార్థులకు మేలు చేసిందని మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అన్నారు. గుంటూరు అమరావతి రోడ్డులోని ఆలా హాస్పిటల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైద్య విద్యార్థుల మేలుకు ప్రభుత్వం చేస్తున్న చర్యల్ని అభినందించారు. బీ కేటగిరి సీట్ల ఫీజులు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో చాలా తక్కువగా ఉండటం వల్ల ఇతర రాష్ట్రాల విద్యార్థులు అనేక మంది ఇక్కడ చేరుతున్నారని వెల్లడించారు. తద్వారా రాష్ట్రంలో స్థానికంగా ఉన్న వైద్య విద్యార్థులకు ప్రభుత్వం ఆశించిన మేరకు లబ్ధి చేకూరడం లేదని తెలిపారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో స్థానికులకు ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో బీ కేటగిరి సీట్లల్లో 85 శాతం రిజర్వేషన్ కేటాయించారని, దీనివల్ల మన రాష్ట్ర విద్యార్థులకు చేరే అవకాశం తగ్గిపోయిందని వివరించారు. రాష్ట్ర విద్యార్థుల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకుని బీ కేటగిరిలో 85 శాతం సీట్లను స్థానికులకే కేటాయించాలని కోరారు.